Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

RAJADHANIVARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 362 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 19 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## ఇరాన్ నుంచి 110 మంది విద్యార్థులతో ఢిల్లీకి చేరుకోనున్న తొలి విమానం



**న్యూఢిల్లీ:** ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం తీవ్రమవుతుండటంతో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను విడిచిపెట్టి అర్మేనియా సరిహద్దుకు చేరుకున్న భారతీయ విద్యార్థులను స్వదేశానికి తీసుకువస్తున్నారు. 110 మంది భారతీయ విద్యార్థులతో కూడిన విమానం బుధవారం రాత్రి ఢిల్లీకి చేరుకోనుంది. ఇందులో 90 మంది కశ్మీర్‌కు చెందిన విద్యార్థులు ఉన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఇరాన్‌లోని భారతీయులను తరలించేందుకు, కొందరిని ఇరాన్‌లోని సురక్షిత ప్రాంతాలకు పంపేందుకు అక్కడి భారత రాయబార కార్యాలయం ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో అర్మేనియా చేరుకున్న భారతీయ విద్యార్థులను దోహాకు తరలించారని, అక్కడి నుంచి విమానంలో న్యూఢిల్లీకి తీసుకు వస్తున్నారని జమ్మూకశ్మీర్ స్టూడెంట్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ విమానం బుధవారం రాత్రి 10.15 గంటలకు ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకునే అవకాశం ఉంది. ఇరాన్‌లో 4,000 మంది భారతీయులుండగా, వారికి సగం మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలోనూ ఎక్కువ మంది జమ్మూకశ్మీర్‌కు చెందిన వారున్నారు. వీరు ప్రధానంగా మెడికల్, ఇతర వృత్తి విద్యా కోర్సులు చేస్తున్నారు. ఇరాన్‌లోని ఉర్మియా మెడికల్ యూనివర్శిటీలో ఎక్కువ మంది విద్యాభ్యాసం చేస్తున్నట్టు జమ్మూ అండ్ కశ్మీర్ స్టూడెంట్స్ అసోసియేషన్ తెలిపింది. ఇరాన్‌లోని ఎన్ఆర్ఐలతో అక్కడి భారత రాయబార కార్యాలయం ఎప్పటికప్పుడు సంప్రదిస్తోందని, అవసరమైన సహాయాన్ని అందిస్తోందని కేంద్ర విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## నా రాజకీయ భవిష్యత్తు నాశనం చేసేందుకే.. : వైఎస్ షర్మిల




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నది ముమ్మాటికీ నిజమని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. 2018-19 పొలిటికల్ టైమ్‌లో తెలంగాణా సిఎంగా కేసీఆర్, ఏపీ సిఎం జగన్‌గా ఉన్నప్పుడు చాలా సన్నిహితంగా ఉండే వారని గుర్తు చేశారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఈ ఇద్దరి సీఎంల జాయింట్ ఆపరేషన్ అని ఆమె అభివర్ణించారు. వాళ్ల సంబంధం ముందు రక్త సంబంధం కూడా చిన్నబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం విశాఖపట్నంలో వైఎస్ షర్మిల విలేకర్లతో మాట్లాడుతూ.. నా ఫోన్, నా భర్త ఫోన్ టాప్ అవుతుందని తమకు స్పష్టంగా అర్థమైందన్నారు. వైసీపీ సీనియర్ నేత వైవి సుబ్బారెడ్డి స్వయంగా వచ్చి ఫోన్స్ ట్యాప్ అవుతున్నాయని నాతో పేర్కొన్నారని ఆమె గుర్తు చేసుకున్నారు. తమ ఫోన్ సంభాషణ నాకే వినిపించారని చెప్పారు. ఈ విషయం సుబ్బారెడ్డి ఒప్పుకుంటారా? అంటే నాకు అనుమానమేనన్నారు. ఏ విచారణకు అయినా బైబిల్ మీదా.. నా బిడ్డల మీద ప్రమాణం వేసి చెప్పగలనని వైఎస్ షర్మిల ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ ఆడియోలు నాకే వినిపిస్తే ఇది ఇల్లీగల్ కూడా అని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణాలో చేస్తున్నా అరాచకాలతో పోలిస్తే ఫోన్ ట్యాపింగ్ విషయం చిన్నదిగా అనిపించిందని అందుకే ఈ అంశాన్ని బయటకు చెప్పలేక పోయానని వైఎస్ షర్మిల వివరించారు. నా రాజకీయ భవిష్యత్ నాశనం చేయటానికే ఈ ఫోన్ ట్యాపింగ్ చేయించారని మండిపడ్డారు. నాకు అండగా నిలబడ్డా వారికి సైతం బెదిరింపులు చేశారని గుర్తు చేశారు. నేను ఊపిరి తీసుకోవడమే కష్టమన్నట్లుగా వైఎస్ జగన్ వ్యవహరించారన్నారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిన మాట వాస్తమని ఆమె ప్రకటించారు. అప్పుడు చేయలేని పోరాటం ఇప్పుడు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఏ ఎంక్వైరీకైనా సిద్ధంగా ఉన్నానన్నారు. నేను ఫిర్యాదు చేయాలనుకుంటే ఆస్తులు పంచిన రోజే ఫిర్యాదు చేసే దానిని ఆమె పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై దర్యాప్తు పూర్తి స్థాయిలో జరగాలని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల ఆకాంక్షించారు. విశాఖపట్నం జిల్లా పర్యటన కోసం పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల.. హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖపట్నం బుధవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా వైఎస్ షర్మిల అరకు వెళ్లనున్నారు.

## ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్‌తో మంత్రి లోకేష్ భేటీ

**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బిజీ బిజీగా గడుపుతున్నారు. బుధవారం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్‌తో లోకేష్ భేటీ అయ్యారు. సుమారు గంటసేపు ఉపరాష్ట్రపతితో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలు, అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఉపరాష్ట్రపతికి మంత్రి లోకేష్ వివరించారు. మరింత వేగవంతమైన అభివృద్ధికి సహాయ, సహకారాలను అందించాలని జగదీప్ ధన్కడ్‌ను కోరారు.




**ఏపీలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు**

దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నట్లు ఉపరాష్ట్రపతికి మంత్రి లోకేష్ తెలిపారు. దీనికి ధన్కడ్ స్పందిస్తూ....అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పుడూ ముందుంటారని అన్నారు. అలాగే ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై ఆయన అడిగి తెలుసుకున్నారు. రూ. 64 వేల కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించామని, పనులు వేగంగా పూర్తి చేస్తామని లోకేష్ సమాధానంగా చెప్పారు.

**చరిత్ర సృష్టించబోతున్నాం..**

ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో ప్రధాని నరేంద్రమోదీ హాజరయ్యే యోగాంధ్ర కార్యక్రమంతో చరిత్ర సృష్టించబోతున్నామని లోకేష్ అన్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశానికి గత 40 ఏళ్లలో ఎప్పుడూ గెలవని మంగళగిరిని తాను ఎంచుకున్నానని లోకేష్ చెప్పగా, తాను కూడా తొలిసారి పరిచయం లేని నియోజకవర్గాన్నే ఎంచుకొని పోరాడానని ధన్కడ్ అన్నారు. 226 రోజుల పాటు 3,132 కి.మీ.ల మేర తాను చేసిన పాదయాత్రలో ఎదురైన అనుభవాలను కళ్లకు కడుతూ రూపొందించిన యువగళం పుస్తకాన్ని ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతికి లోకేష్ అందించారు. పాదయాత్ర ద్వారా ఏపీ ప్రజల్లో చైతన్యాన్ని నింపిన లోకేష్‌ను వైస్ ప్రెసిడెంట్ ధన్కడ్ అభినందించారు. లోకేష్‌తో పాటు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, టీటీడీపీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు, కేశినేని చిన్ని, మాగుంట శ్రీనివాసుల రెడ్డి, బస్తిపాటి నాగరాజు, సానా సతీష్, శబరి తదితరులు ఉన్నారు. కాగా ఈరోజు పలువురు కేంద్రమంత్రులతో లోకేష్ సమావేశం కానున్నారు. మధ్యాహ్నం కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో భేటీకానున్నారు. ఇది చాలా కీలకమైన సమావేశం. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్‌లో ఏపీకి చెందిన నేతల ఫోన్లు కూడా ట్యాప్ అయినట్లు సమాచారం. దీనిపై ప్రధానంగా కేంద్రమంత్రితో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఏపీ లిక్కర్ కేసులో జరుగుతున్న పరిణామాలపై కేంద్ర హెూంమంత్రికి వివరించనున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మాజీ సీఎం జగన్‌కు సంబంధించిన వ్యవహారాలపై ఎక్కువగా చర్చించి అవకాశం ఉన్నట్లు సమాచారం. అనంతరం మరో ముగ్గురు కేంద్ర మంత్రులను కూడా మంత్రి లోకేష్ కలువనున్నారు.

## మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

**అల్లూరి జిల్లా, (రాజధాని వార్తలు):** మారేడుమిల్లి అడవుల్లో బుధవారం తెల్లవారు జామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన కాల్పుల్లో మావోయిస్టులకు భారీ నష్టం జరిగింది. మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు ఉదయ్, జోనల్ కమిటీ సభ్యురాలు అరుణ మృతి చెందారు. మరో మావోయిస్టు హతమైనట్లు సమాచారం. ఎన్‌కౌంటర్ ఘటనా స్థలి నుంచి మావోయిస్టులు పరారయ్యారు. మరి కొంతమంది మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం అందడంతో మారేడుమిల్లి అడవుల్లో గ్రేహౌండ్స్ బలగాల కూంబింగ్ కొనసాగుతోంది. కాగా ఉదయ్, అరుణలపై రివార్డులు ఉన్నట్టు సమాచారం. కాగా మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. 21 ఏళ్ల క్రితం పార్టీ ఆవిర్భావం సమయంలో 42 మంది ఉండేవారు. ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో సభ్యుల సంఖ్య తగ్గింది. ఈ ఏడాదే ఎన్‌కౌంటర్లలో నలుగురు మృతి చెందారు. మిగిలిన 16 మందిలో 11 మంది తెలుగువారే కావడం గమనార్హం. కొత్త ప్రధాన కార్యదర్శి ఎంపికపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి.

**తగ్గిన సభ్యుల సంఖ్య..**

10 రోజుల క్రితం బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన నర్సింహాచలం అలియాస్ సుధాకర్‌తో కలిపి ఈ ఏడాది ఇప్పటి వరకూ నలుగురు మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు కూడా ఉన్నారు. 2004లో నాటి పీపుల్స్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ కలిసి మావోయిస్టు పార్టీగా ఏర్పడినపుడు 42 మందితో కేంద్రకమిటీ ఏర్పాటైంది. ఈ 21 ఏళ్లలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు, సహజమరణాలతో కేంద్ర కమిటీలోని సభ్యుల సంఖ్య 16కి తగ్గిపోయింది. రెండు దశాబ్దాల ప్రస్థానంలో మావోయిస్టు పార్టీ మధ్యభారతంలోని కొన్ని వేల కిలోమీటర్ల పరిధిలో జనతన సర్కార్ పేరుతో సమాంతర ప్రభుత్వాన్ని నడిపింది. అబూజ్‌మడ్ వంటి కంచుకోటలను ఏర్పాటు చేసుకుని నాయకులను, క్యాడర్‌ను కాపాడుకుంది.

**మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ..**

ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. మరో సెంట్రల్ కమిటీ మెంబర్‌ను కోల్పోయింది. ఏపీ గ్రేహౌండ్స్ ఎన్ కౌంటర్‌లో ఏవోబీ సెక్రెటరీ గాజర్ల రవి అలియాస్ ఉదయ్ మృతి చెందాడు. వరంగల్, భూపాల పల్లి జిల్లాకు చెందిన గాజర్ల రవి.. కాంగ్రెస్ నేత, మాజీ మావోయిస్టు గాజర్ల అశోక్ అలియాస్ ఐతు సోదరుడే గాజర్ల రవి. కాగా భద్రతా బలగాలు ఉదయ్ మృతిపై ఆయన కుటుంబ సభ్యులకు ఇంకా సమాచారం ఇవ్వలేదు.

**ఆపరేషన్ కగార్...**

కానీ, ప్రస్తుతం కేంద్రప్రభుత్వం సాగిస్తున్న ఆపరేషన్ కగార్‌తో ఆ పార్టీ శ్రేణులు చెల్లాచెదరయ్యారు. వరుసగా జరుగుతున్న



ఎన్‌కౌంటర్లలో భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. మృతుల్లో కీలక నాయకులు కూడా ఉంటున్నారు. ఈ ఏడాది జనవరిలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లోని కుల్హాదీఘాట్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడైన రామచంద్రారెడ్డి అలియాస్ జయరాం, అలియాస్ చలపతి మరణించారు. ఆ తర్వాత మే నెలలో బీజాపూర్ జిల్లా ఉసూర్ సమీపంలోని లంకపల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న మరణించారు. అదే నెలలో నారాయణపూర్‌లో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో ఏకంగా మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టు పార్టీ చరిత్రలో ఎన్‌కౌంటర్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి మరణించటం ఇదే ప్రథమం. ఆ ఎన్‌కౌంటర్‌లో కేశవరావుతోపాటు 27 మంది మావోయిస్టులు మరణించిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో కేంద్ర కమిటీ సభ్యుడు, ఏపీకి చెందిన తెంటు నర్సింహాచలం అలియాస్ సుధాకర్ (64) చనిపోయారు. ఈ విధంగా ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు ఎన్‌కౌంటర్లలో మరణించారు.

**మిగిలింది 16 మంది...**

కేంద్ర కమిటీలో ప్రస్తుతం 16 మంది ఉన్నట్లు సమాచారం. వీరిలో ఏపీ, తెలంగాణకు చెందిన వారు 11 మంది కాగా, జార్ఖండ్‌కు చెందినవారు ముగ్గురు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు ఇద్దరున్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన వారు మల్లోజుల వేణుగోపాలరావు అలియాస్ సోనూ, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, మోడెం బాలకృష్ణ, పాక హన్మంతు అలియాస్ ఊకే గణేష్, కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజుదాదా, గాజర్ల రవి అలియాస్ ఉదయ్, పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్, పోతుల కల్పన. జార?ండ్‌కు చెందిన వారు మిసిర్ బెస్రా అలియాస్ సునీల్, అనల్ దా అలియాస్ పాతిరాం మాంజీ, సహదేవ్ అలియాస్ అనూజ్. ఛత్తీసగఢ్‌కు చెందిన వారు మాజ్జీదేవ్ అలియాస్ రాంధీర్, మాడ్వి హిడ్మా. వీరిలో పలువురు 60 ఏళ్లకు పైబడినవారే. కాగా, కేంద్ర కమిటీ సభ్యుల్లో ఎవర్ని పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రకటిస్తారని పోలీసు వర్గాలు ఆరా తీస్తున్నాయి.

## రెచ్చిపోయిన అంబటి సోదరులు




**పల్నాడు, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనలో మాజీ మంత్రి అంబటి రాంబాబు రెచ్చిపోయారు. మాజీ మంత్రి, అతని సోదరుడు మురళి కలిసి రోడ్డుపై అడ్డంగా పెట్టి ఉన్న బారికేడ్‌లు విసిరిపడేశారు. వీరిని అడ్డుకోబోయిన పోలీసులపై అంబటి రాంబాబు దౌర్జన్యంగా ప్రవర్తించారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అంతేకాకుండా ఏకంగా పోలీసులకే అంబటి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఆపై అంబటి సోదరులు బారికేడ్‌లు తొలగించి వైసీపీ కార్యకర్తలను ముందుకు పంపించారు. కాగా.. జగన్ రెడ్డి పల్నాడు పర్యటన మొత్తం అరాచకాలు, దౌర్జన్యాలతో ముందుకు సాగుతోంది. సత్తెన్నపల్లి పట్నంలో ఓ సీఐపై వైసీపీ మూకలు దౌర్జన్యం చేసి అతడిని నెట్టివేయగా.. మరోవైపు ఆర్టీసీ బస్సుపై జెండా కర్రలతో దాడి చేశారు. పల్నాడు, గుంటూరు జిల్లా సరిహద్దులో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్ల వద్ద మాజీ మంత్రి హల్‌చల్ చేశారు. బారికేడ్లను తోసివేసి.. ఆంక్షలు విధించిన పోలీసులపై దౌర్జన్యం చేస్తూ వైసీపీ కేడర్‌ను సత్తెనపల్లి వైపు వెళ్లేలా వీరంగం సృష్టించారు. నిబంధనలకు విరుద్ధంగా అంబటి భారీ ర్యాలీగా రావడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రెచ్చిపోయిన అంబటి.. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను రోడ్డుపై నుంచి తోసిపడేశారు. జగన్ పల్నాడులోకి ప్రవేశించాక.. ఆయనతో పాటు వచ్చిన కార్యకర్తలు, కేడర్ వాహనాలను పల్నాడు వద్ద బార్డర్‌లో బారికేడ్లు పెట్టి నిలిపివేశారు. అదే రోడ్డులో వస్తున్న అంబటి రాంబాబు, అతని సోదరుడు అంబటి మురళి.. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వారిద్దరినీ పంపిస్తామని పోలీసులు చెప్పినప్పటికీ బారికేడ్లను స్థానిక నేతలతో కలిసి సోదరులు ఇద్దరు బారికేడ్లను లాగిపడేస్తూ పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. నర్సరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావుకు పోలీసుల అంతు తేలుస్తాం అంటూ వార్నింగ్ ఇచ్చారు. కొద్ది రోజుల క్రితం వైసీపీ చేపట్టిన వెన్నుపోటు దినోత్సవంలో కూడా పట్టాభిపురం సీఐపై కూడా అంబటి రాంబాబు ఇదే విధంగా దురుసుగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. పోలీసుల పట్ల అంబటి రాంబాబు ప్రవర్తిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# జాతీయ లోక్ అదాలత్‌ను చిట్స్ అండ్ ఫైనాన్స్ కంపెనీలు జాతీయ, ప్రైవేట్ బ్యాంకులు సద్వినియోగం చేసుకోవాలి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** గౌరవ జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఎం.భబిత ఆధ్వర్యంలో ప్రముఖ చిట్ఫండ్ కంపెనీలకు బ్యాంక్ మేనేజర్లు మరియు బ్యాంక్‌కు సంబంధించిన అధికారులతో మరియు కంపెనీ యొక్క న్యాయవాదులతో సమావేశం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చిట్ కంపెనీలకు మరియు బ్యాంక్‌కు సంబంధించిన కేసులను త్వరలో 05. 07.2025 జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో పరిష్కరించుకోవాలని కంపెనీలకు సంబంధించిన బ్రాంచ్ మేనేజర్ మరియు బ్యాంక్ మేనేజర్లతో సమావేశం ఏర్పాటు చేసినారు.

పెండింగ్‌లో ఉన్న ఈపీలు, బ్యాంకు దావాలను ఎక్కువ కేసులను రాజీ చేయాలని వారికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఏ కృష్ణ ప్రసాద్ మరియు మార్గదర్శి చిట్ ఫండ్స్ కపిల్ చిట్ ఫండ్స్ శ్రీరామ్ చిట్ ఫండ్స్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

# ప్రతి మహిళ లక్షాధికారి కావాలి

## - జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్




**మన్యం జిల్లా, (రాజధాని వార్తలు):** జిల్లాలోని ప్రతి మహిళా లక్షాధికారి కావాలని, ప్రతి ఇంటి నుంచి ఒక మహిళా పారిశ్రామిక వేత్త వచ్చేలా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మెప్మా అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. వివిధ రకాల జీవనోపాధుల ద్వారా డబ్బులు సంపాదించే మార్గాలు అనేకం ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకొని మహిళలను లక్షాధికారులుగా తీర్చిద్దాలని సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మెప్మా ఆధ్వర్యంలో ఏపీఎంలు, సీఓలు, ఆర్పీలతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మహిళలకు జీవనోపాధులను కల్పించి వారి ఆదాయాన్ని రెట్టింపు చేసేలా చేస్తున్న కృషిని కలెక్టర్ ముందుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మెప్మా ఆధ్వర్యంలో ఉన్న స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులతో కొత్త వ్యాపార యూనిట్లను స్థాపించి, వారిని లక్షాధికారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. యూనిట్ల స్థాపనలో మహిళలు లాభాలు ఆర్జించేలా ఉండాలన్నారు. అలాగే యూనిట్ల ఏర్పాటుకు అవసరమైతే శిక్షణను ఇప్పించాలని సూచించారు. కొత్త ఆలోచనలతో వ్యాపారాలను విస్తరించవచ్చని, ఆ దిశగా ఆలోచనలు చేయాలని పేర్కొన్నారు. సరుకుల కొనుగోలు, విక్రయాలలో నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని, అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో విక్రయించడం ద్వారా, డోర్ డెలివరీ వంటి సదుపాయాలను కల్పించడం ద్వారా వ్యాపారాలను మరింత విస్తరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే మహిళా మార్టులు, మొబైల్ మార్టులు, కాఫీ షాపులు వంటి కొత్త ఆలోచనల ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. ఇప్పటికే వస్త్ర వ్యాపారాలు, తినుబండారాలు, ఫ్యాన్సీ షాపుల ద్వారా మహిళలు లాభాలను ఆర్జిస్తున్నారని, అయినప్పటికీ వీటికి భిన్నంగా అందరికి అవసరమయ్యే వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు కలెక్టర్ హితవు పలికారు. అనంతరం ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై సమీక్షించిన ఆయన ప్రతి ఉద్యోగి సూర్యఘర్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సూర్య ఘర్ యూనిట్ ఏర్పాటుతో 28 ఏళ్ల పాటు ఉచితంగా విద్యుత్ పొందవచ్చని, ఇందుకు అవసరమైన రుణాలను బ్యాంకు మంజూరు చేయడమే కాకుండా దాదాపు 50 శాతం వరకు సబ్సిడీ కూడా ప్రభుత్వం నుంచి లభిస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ముందుగా స్వంత ఇళ్లు కలిగిన మెప్మా ఉద్యోగులు, సిబ్బంది సూర్యఘర్ యూనిట్లను ఏర్పాటుచేసుకొని, మిగిలిన సభ్యులకు అవగాహన కల్పించి, వారు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వచ్చే మాసానికి ప్రతీ ఉద్యోగి కనీసం 100 యూనిట్లు గ్రౌండింగ్ చేయించాలని, బ్యాంకుల నుంచి సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకు రావాలని అన్నారు. ఈ సమావేశంలో మెప్మా పథక సంచాలకులు జి.వి.చిట్టిరాజు, ఏపీఎంలు, సీఓలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ అవార్డు గ్రహీత చిట్టిబాబుకు ఘనంగా సన్మానం



**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్వాతంత్ర్య సమరయోధుడు, భారత రాజ్యాంగ విధాన పరిషత్ సభ్యుడు, భారతరత్న సి సుబ్రహ్మణ్య పేరిట నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా వారిచే అందుకున్న జాతీయ అవార్డు గ్రహీత చిట్టిబాబు తనను తాను చెక్కుకున్న శిల్పి అని విశ్రాంత ఐజీ లేళ్ల కాళిదాసు రంగారావు ప్రశంసించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పౌర సన్మాన వేదిక, దళిత బహుజన శ్రామిక యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ అవార్డు గ్రహీత, డి బీ ఎస్ యు వ్యవస్థాపకుడు పెంకి చిట్టిబాబుకు ఆత్మీయ అభినందన కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్ జైరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంకి రిటైర్డ్ ఐజీ ఎల్ కే వీ రంగారావు ముఖ్య అతిథులు హాజరై, అతిథులతో కలిసి చిట్టిబాబు, ఆయన సతీమణి సుదీపాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తెలుగులో ప్రచురించిన భారత రాజ్యాంగ పుస్తకాన్ని ముఖ్య అతిథి రిటైర్డ్ ఐజీ ఎల్ కే వీ రంగారావు తన చేతుల మీదుగా ఆవిష్కరించారు. అవార్డు గ్రహీత ఈ చిట్టిబాబు మాట్లాడుతూ సామాజిక ఉద్యమంలో దళిత ఆదివాసి మానవ హక్కుల ఉద్యమంలో పని చేస్తున్న సహకారమందించిన ప్రతి ఒక్కరికి అవార్డు అంకితమని తెలిపారు.

# చినకాద గ్రామంలో స్కూల్ బ్యాగులు పుస్తకాల పంపిణీ

## - పుస్తకాలు బ్యాగులు పంపిణీ చేసిన శిరువూరి నారాయణమూర్తి రాజు : ధూళి సూర్యారావు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** దత్తిరాజేరు మండలంలోని చినకాద గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా విద్యార్థులకు విద్యా సామాగ్రిని టిడిపి నాయకులు అందజేశారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, సర్ప్ ఎన్ఆర్ఐ శాఖ మాత్యులు కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాలతో చినకాద గ్రామంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద ఆ పార్టీ నాయకులు శిరువూరి నారాయణమూర్తి రాజు, గ్రామ ఉప సర్పంచ్ ధూళి సూర్యారావు, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బి.సి కాలనీ, ఎస్సీ కాలనీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగాలు గిరిజనులకే చెందాలి



**పాచిపెంట/ మన్యం జిల్లా, (రాజధాని వార్తలు):** జీవో నెంబర్ 3 పైన రాష్ట్ర ప్రభుత్వము గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని గిరిజనులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాచిపెంట మండలం పెద చీపురు వలస కోష్టు వలస జంక్షన్ల వద్ద ఆదివాసి గిరిజన సంఘం సిహెచ్ జగన్నాథం, మంచాల గంగరాజు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చేయక పోవడం గిరిజనులు పాలిట శాపంగా మారిందని ఉద్యోగ భద్రత లేకుండా పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఇప్పటికైనా ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేసి జీవో నెంబర్ మూడును కొనసాగించాలని ఐటీడీఏ పరిధిలో ఉన్నటువంటి అన్ని పోస్టులు గిరిజనులకే చెందాలి అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజన చట్టాలను మార్పు చేసి కార్పొరేట్లకు అడవులను కొండలను ఖనిజ సంపదను అప్ప చెప్తుంటే, కూటమి ప్రభుత్వం కేంద్ర బిజెపి ప్రభుత్వానికి అండగా ఉంటూ గిరిజనులను నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో గిరిజలంతా ఐక్యంగా మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ టీచర్ పోస్టులు మినహాయించాలని ఏజెన్సీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని జీవో నెంబర్ 3 ప్రకారము నూటికి నూరు శాతం గిరిజనులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన కార్యక్రమాలు చేస్తుంటే దీని గురించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల గిరిజనుల పాలిట శాపంగా మారిందని తెలిపారు. 2005 సంవత్సరం అటువకుల చట్టం ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి పది ఎకరాలు చొప్పున పట్టాలు ఇవ్వాలని ఉన్న కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం గిరిజనులకు ద్రోహం చేయడమేనని అన్నారు. అటువాకుల చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వకుండా సాగులో ఉన్నటువంటి భూములకు 5 ఎకరాలు సాగులో ఉంటే 50 సెంట్లు ఎకరం సాగులో ఉంటే 20 సెంట్లు అలా తక్కువ పట్టాలు ఇవ్వడం గిరిజనులకు ద్రోహం చేయడమేనని అన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో భూములన్ని అన్యాక్రాంతం అయ్యాయని సాగు చేస్తున్న భూములకు పూర్తిస్థాయిలో పట్టాలు మంజూరు చేయకపోవడం భూములు అన్ని కూడా అన్యాక్రాంతమవుతున్నాయని అనేక సందర్భాల్లో అధికారులకు తెలియజేసిన పట్టించుకోకపోవడం వలన గిరిజనులు పేదలు నష్టపోయారని అన్నారు. జీవో నెంబర్ 3 పైన గిరిజన చట్టాల పైన స్పష్టమైన హామీ మంత్రి సంధ్యారాణి ఇవ్వాలని. హామీలు అమలు చేయా లని వన్ బై సెవెంటీ చట్టం పీసా చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ గ్రామాల్లో చేర్చి గిరిజనులకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రతి ఆశ్రమ పాఠశాలకి రెగ్యులర్‌గా ఒక ఏఎన్ఎం ఉండే విధంగా చర్యలు తీసుకో వాలని, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజనులు యువకులు పాల్గొన్నారు.

# తల్లికి వందనం గొప్ప కార్యక్రమం : డిసిసిబి చైర్మన్

## - టీడీపీ జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున కామెంట్స్



**విజయనగరం, (రాజధాని వార్తలు):** నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో తల్లిదండ్రుల కార్యక్రమం అమలు చేయడం జరిగిందని తల్లికి వందనం కార్యక్రమం గొప్ప కార్యక్రమమని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి డబ్బులు వేయడం జరిగిందని, అమ్మలు అంతా సంతోషం వ్యక్తం చేస్తున్నా రని తెలిపారు. ఇలాంటివి చూడలేని వైసిపీ నాయకులు ఈ కార్యక్రమం మీద బురద జల్లుతున్నారని తెలిపారు. మీ ఆఫీషి యల్ సోషల్ మీడియాలో దారుణంగా పెడుతున్నారని, జడ్పీ చైర్మన్ పుస్తకం విడుదల చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మీరు అలాంటి పుస్తకాలు ఎన్ని విడుదల చేసిన చింపి డస్ట్ బిన్‌లో వేసుకోవడమేనని, మీరు 1000 పింఛన్ పెంచడం కోసం ఐదు ఏళ్లు తీసుకున్నారని తెలిపారు.మీరు సరైన పాలన చేయలేదు కాబట్టే మీకు ఆ స్థానం వచ్చిందని, మేము ఇంటి ఇంటికి వెళ్లి ప్రజలకు ఏమి వివరిస్తాం అనేది మీకు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. మా హామీలు పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉం దని, మేము పింఛన్ వచ్చిన వెంటనే పెంచి చూపించామని, అలాగే మత్స్యకార భరోసా, గ్యాస్ పథకం, ధ్యానం కొనుగోళ్లు 24 గంటల్లో చెల్లించామని,అన్న క్యాంటిన్లు పెట్టామని తెలిపారు. మేము సూపర్ సిక్స్ హామీలు ఒక క్రమంలో అములు చేస్తున్నామని, ఇప్పుడు తల్లికి వందనం వేసామని, రైతులుకి డబ్బులు వేస్తామని బస్సు ఫ్రీ హామీ కూడా అమలు చేస్తాం అన్నారు. మేము విజనరి చంద్రబాబు, లోకేష్ అడుగు జాడల్లో ముందుకు వెళుతున్నాం, రాష్ట్రములో మంచి పాలన ఇస్తున్నామని, వైసిపి ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

# యోగాంధ్ర విజయవంతం చేయండి

## - శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్, మంత్రి అచ్చెన్న




**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** "ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే విశాఖపట్నంలోని యోగాంధ్ర 2025 కార్యక్రమం రాష్ట్రానికి గొప్ప గౌరవం. ఎలాంటి లోపం లేకుండా దీనిని విజయవంతం చేయాలి. ప్రతి శాఖ సమన్వయంతో, సమగ్ర పర్యవేక్షణతో ముందుకు సాగాలి" అని శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, యోగాంధ్ర ఇన్‌చార్జిలు సమావేశంలో పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి విశాఖకు వెళ్లే ప్రణాళికలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా నుంచే 20 వేల మంది విశాఖ కార్యక్రమానికి వెళతారని కలెక్టర్ తెలిపారు. 150 ఆర్టీసీ, 400 ప్రైవేట్ బస్సులు ఇందుకోసం ఏర్పాటు చేశామన్నారు. వీరిలో 15 వేల మంది సామాన్య ప్రజలు కాగా, మిగతా 5 వేల మంది ఇంటర్ ఆపై చదువుతున్న విద్యార్థులు ఉంటారన్నారు. భీమిలి స్పాట్ జిల్లాకు కేటాయించగా, అక్కడే వేదిక వద్ద అల్పాహారం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో ప్యాకేజ్డ్ భోజనం అందజేయాలని మంత్రులు ఈ సందర్భంగా సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు, పామర్రు ఎమ్మెల్యే కుమార్ రాజా, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, పలు శాఖలు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కౌలు రైతులకు పత్రాలు పంపిణీ



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని పాతబగ్గాం, కొత్తబగ్గం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఏ.డి.ఏ కె. మహారాజన్ చేతుల మీదగా కౌలు రైతులకు సి.సి.ఆర్సి. పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కౌలు రైతులు విత్తనాలు రాయితీలు యజమానితో సమానంగా పొందవచ్చన్నారు. పంట నష్టం వాటిల్లితే ప్రభుత్వం అందజేసే పరిహారము కౌలు రైతులకు వర్తిస్తుందన్నారు. పంటల భీమా పథకం కూడా కౌలు రైతులకు వర్తిస్తుందన్నారు. బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కూడా పొందవచ్చు అన్నారు. కౌలు రైతు ఋణం బ్యాంకు ద్వారా పొందవచ్చు. వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ వరిలో 1121 రకంకి బదులుగా, నీటి అవకాశం ఉన్న గ్రామాలలో రైతులు 1318 రకం వేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు అన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఈ రకం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారులు దీప్తి, కీర్తి రైతులు పాల్గొన్నారు.

# సంయుక్త ప్లానింగ్ మామూలుగా లేదుగా



సంయుక్తమీనన్..కేరళ పాలక్కాడ్‌కు చెందిన ఈ మలయాళీ సోయగం గత కొంత కాలంగా తెలుగులో వరుస క్రేజీ ప్రాజెక్టలలో నటిస్తూ గోల్డెన్ లెగ్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. వరుస ఫ్లాపుల్లో ఉన్న హీరోలకు హిట్‌లని అందిస్తూ ఇండస్ట్రీలో లక్కీ హీరోయిన్‌గా మారిన సంయుక్త మీనన్ ఇప్పుడు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ అని తేడా లేకుండా అన్నీ భాషల్లీ చుట్టేస్తూ క్రేజీ ప్రాజెక్టలని సొంతం చేసుకుంటోంది. పవన్, రానాల సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి సంయుక్త అదే ఊపులో క్రేజీ స్టార్లతో కలిసి నటిస్తూ వరుస విజయాల్ని తన ఖాతాలో వేసుకుంటూ ఇండస్ట్రీ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం తెలుగులో నిఖిల్ హీరోగా రామ్‌చరణ్ తన స్నేహితుడితో కలిసి నిర్మిస్తున్న పాన్ ఇండియా మూవీ, స్వయంభుతో పాటు నందమూరి నటసింహం బాలకృష్ణ నటిస్తున్న భారీ ఎమోషనల్ యాక్షన్ డ్రామా, అఖండ-2లోనూ నటిస్తోంది. బోయపాటి శ్రీను డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఇదిలా ఉంటే తాజాగా మరో పాన్ ఇండియా మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. అదే పూరి జగన్నాథ్ ఫిల్మ్. ఈ ప్రాజెక్ట్‌తో సంయుక్త ఖాతాలో మొత్తం ఏడు సినిమాలు వచ్చి చేరాయి. ప్రస్తుతం తను బ్యాక్ టు బ్యాక్ 7 క్రేజీ ప్రాజెక్ట్సలలో నటిస్తూ బిజీగా ఉంది. ఇదే ఏడాది కాజోల్‌తో నటిస్తున్న ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్, మహారాగ్ని:క్వీన్ ఆఫ్ క్వీన్స్‌తో బాలీవుడ్ బాటపడుతోంది. ఇక తెలుగులో శర్వానంద్ హీరోగా రూపొందుతున్న నారీ నారీ నడుమ మురారీలోనూ నటిస్తోంది. సంయుక్త నటిస్తున్న మరో తెలుగు సినిమా హైందవ. బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. ఈ మూవీని తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. మలయాళంలో మోహన్‌లాల్‌తో ,రామ్,లోనూ నటిస్తోంది సంయుక్త. దీని షూటింగ్ ఆగిపోయింది. తిరిగి త్వరలో ప్రారంభం కానుంది. ఇక వీటితో పాటు ఇదే ఏడాది లోకేష్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్‌లోకి అడుగు పెడుతోంది. రాఘవలారెన్స్ హీరోగా భాగ్యరాజ్ కన్నన్‌తో లోకేష్ కనగరాజ్, బెంజ్, మూవీని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో లారెన్స్‌కు జోడీగా సంయుక్త నటిస్తోంది. ఇలా వరుసగా 7 క్రేజీ ప్రాజెక్టలతో ఈ ఏడాది సంయుక్త డైరీ ఫుల్ కావడంతో ఆమె ప్లానింగ్ మామూలుగా లేదుగా అని ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు.

# డిజైనర్ చీరలో జాన్వీ హొయలు



ఫూల్ సైడ్ బికినీ ట్రీట్ అయినా.. జిమ్ యోగా సెషన్స్‌లో బాడీ ఫిట్ ట్రాక్‌లతో హీటెక్కించడంలో అయినా నేటితరంలో జాన్వీ కపూర్ తర్వాతే. ట్రెడిషనల్ శారీలోను హృదయాల్ని కొల్లగొట్టే వైబ్స్‌ని తేవడంలో ఎప్పుడూ విఫలం కాదు. బాలీవుడ్‌లో ట్రెండింగ్ స్టార్‌గా కొనసాగడంలో కపూర్ ఫ్యాషనిస్టా ఫ్యాషన్ సెన్స్, ఎంపికల్ని కాదనలేం. జాన్వీ పలు సందర్భాల్లో హృదయాల్ని దోచుకునే ట్రెడిషనల్ డిజైనర్ చీరల్లో, కాంబినేషన్ ఆభరణాలతో ముగ్ధ మనోహరంగా కనిపించింది. అలాంటి ఒక చీరందాన్ని ఇక్కడ ప్రదర్శిస్తే, ఈ చీరలో ప్రత్యేకత ఏమిటో యూత్ వర్ణించడంలో బిజీగా మారింది. పింక్ చీరలో గుబులు పెంచింది జాన్వీ. పాక్షికంగా అందాల్ని ఎలివేట్ చేసే ఈ చీరను క్రిస్టలైన్ బార్డర్ తో అందంగా రూపొందించగా, ఎంపిక చేసిన బ్లౌజ్ పచ్చందంతో క్రిస్టలైన్ డిజైన్‌తో ఎంతో అందంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారుతోంది. ఆసక్తికరంగా జాన్వీ ధరించిన ఆ స్పెషల్ నెక్టెస్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఇది తెలుపు మెరూన్ కలయికతో రూపొందించిన డిజైనర్ నెక్లెస్. ఆ అందమైన నెక్‌లైన్‌పై సులభంగా కళ్లు తిప్పుకునేలా అందమైన లారియట్ నెక్లెస్‌ను ఎంపిక చేసుకుంది. ఈ నెక్లెస్ ధగధగలు జాన్వీ అందాన్ని పదింతలు పెంచాయి. చీరలు, లెహంగాలు సహా సాంప్రదాయ లేదా అధికారిక ఇండియన్ స్టైల్ దుస్తులతో ఈ నెక్లెస్‌ని ధరిస్తారు.

కెరీర్ మ్యాటర్‌కి వస్తే .. జాన్వీ ప్రస్తుతం రామ్ చరణ్ సరసన పెద్ది చిత్రంలో నటిస్తోంది. ఉప్పెన ఫేం బుచ్చిబాబు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. తదుపరి తమిళ హీరో సూర్య సరసన ఓ చిత్రంలో జాన్వీ కపూర్ నటిం చనుందని కథనాలొస్తున్నాయి. కానీ ఇంకా అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది.

# రాజా సాబ్ స్టోరీ ఇలా ఉంటుందా?




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబినేషన్‌లో రాజా సాబ్ రూపొందుతున్న విషయం తెలిసిందే. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. నటుడు సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎస్ ఎస్ తమన్ మ్యూజిక్ అండ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. రొమాంటిక్ కామెడీ జోనర్ లో సిద్ధమవుతున్న రాజా సాబ్‌ను భారీ బడ్జెట్‌తో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. అయితే సినిమాను షూటింగ్ కొంత అయ్యే వరకు అఫీషియల్‌గా అనౌన్స్ చేయలేదు. ఆ తర్వాత టైటిల్ పోస్టర్‌ను విడుదల చేయడంతో ఓ రేంజ్‌లో అంచనాలు నెలకొన్నాయి. ఆ తర్వాత ఎలాంటి అప్డేట్ ఇవ్వకపోవడంతో ఫ్యాన్స్ వెయిట్ చేశారు. ఇప్పుడు టీజర్‌ను రిలీజ్ చేసి ఒక్కసారిగా సంచలనం సృష్టించారు. వింటేజ్ ప్రభాస్‌ను సినిమాలో చూపిస్తున్నట్లు.. కూల్‌గా డార్లింగ్ కనపడనున్నట్లు క్లారిటీ ఇచ్చారు. అదిరిపోయే విజువల్స్, సూపర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, వేరే లెవెల్ ప్రభాస్ యాక్షన్ అండ్ లుక్స్‌తో మెప్పించారు. అయితే సినిమాలో ప్రభాస్ ద్యుయల్ రోల్ పోషిస్తున్నారని ఇప్పటికే అందరికీ క్లారిటీ వచ్చేసింది. అదే సమయంలో ఇప్పుడు ఓ ప్రభాస్ ఫ్యాన్ చేసిన సోషల్ మీడియా పోస్ట్.. వైరల్‌గా మారింది. ఇప్పటివరకు ప్రమోషనల్ కంటెంట్ ద్వారా స్టోరీలో ఇలా ఉంటుందేమోనని సదరు నెటిజన్లు అంచనా వేస్తున్నారు. టీజర్‌లో యంగ్ ప్రభాస్ రోల్‌ను చూపించిన మేకర్స్.. తాత పాత్రను చూపించలేదు. ఆయనే రాజా సాబ్ అంట. ఎక్కడో సుదూర అడవి ప్రాంతంలో ఉన్న కోట.. దెయ్యం బంగ్లాలా అనిపించినా లోపల మాత్రం రాజభవనంలా ఉంటుంది. చావు తర్వాత కూడా తానే అనుభవించాలనే ఒక రాజు సంజయ్ దత్.. వలయాన్ని ఏర్పాటు చేసుకుంటాడు. రాజు, రాణి సన్నివేశాలను టీజర్‌లో చూపించారు. టీజర్‌లో చూపించిన ఒక తాళం.. అది బంగ్లాది కాదు.. అంతులేని సంపద ఉన్న గది అని తెలుస్తోంది. దాన్ని స్వాధీనం చేసుకోవడానికి కొందరు ట్రై చేస్తుంటారు. ఓసారి ఫ్రేమ్‌ను దెయ్యం పట్టుకున్నట్లు ఉండగా.. మరోసారి ఫ్రేమ్ నుంచి వచ్చినట్లు చూపించారు. ఇవన్నీ సంపద ఉన్న గదికి కాపలాగా తెలుస్తోంది. ఆ తర్వాత యంగ్ ప్రభాస్ రోల్.. ఫైట్ సీన్‌తో ఎంట్రీ ఇస్తారని అర్థమవుతోంది. అప్పుడే సాంగ్ కూడా ఉంటుంది. తర్వాత నిధి అగర్వాల్‌కు బండి కొంచెం మెల్లగా అని చెబుతారు. రిద్ధి కుమార్ తో ప్రేమలో పడతారు. మాళవిక ఫైట్ సీన్‌తో ఎంట్రీ ఇస్తుంది. ఫుల్ డిచ్‌లో ఉన్న ప్రభాస్ ఆమెను చూసి హ్యాపీ అవుతారు. బంగ్లాలోకి ప్రభాస్ సింగిల్‌గానే వెళ్తారు. అక్కడ మిగతా వారు ఉంటారు. ఆ సమయంలో రాజా సాబ్ పునర్జన్మ రానున్నట్లు తెలుస్తోంది. డార్లింగ్ ఫ్యామిలీని చూపించినట్లు ఉన్నారు. ఓ హీరోయిన్ కు ప్రభాస్ కళ్ల ముందే పెళ్లి జరిగినట్లు అర్థమవుతోంది. ఇవన్నీ గెస్ మాత్రమే.. డిసెంబర్ 5నే అసలు విషయం తెలుస్తుంది. చివరగా.. ప్రభాస్ అనుకోకుండా సంజయ్ దత్ రాజ్ మహల్ లోకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఏం జరిగింది.. ప్రభాస్‌కు రాజ్ మహల్‌కు సంబంధమేంటి.. భయపెట్టిస్తున్న తాత ఎవరు.. వంటి ప్రశ్నలకు సమాధానాలు కావాలంటే మరికొన్ని నెలలు ఆగాల్సిందే.

# సిద్ధార్థ్‌లో ఈ మార్పుకు కారణం అదేనా?



నయనతార, మాధవన్‌లతో కలిసి సిద్ధార్థ్ నటించిన టెస్ట్ మూవీ ఫ్లాప్ అయి తీవ్ర నిరాశకు గురి చేసిన విషయం తెలిసిందే. ఈ మూవీ తరువాత సిద్ధార్థ్ ఫ్యామిలీ డ్రామా 3BHKతో రాబోతున్నాడు. శరత్‌కుమార్, దేవయాని, యోగిబాబు, మీతా రఘునాథ్, చైత్ర జె.అచర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.శ్రీగణేష్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని అరవింద్ సచిదానందన్ షార్ట్ స్టోరీస్ నవల ఆధారంగా తెరకెక్కిస్తున్నారు.అరుణ్ విశ్వ నిర్మిస్తున్న ఈ సినిమాని జూలై 4న రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. మరి కొన్ని రోజుల్లో సినిమా రిలీజ్ కానున్న నేపథ్యంలో హీరో సిద్ధార్థ్ ప్రమోషన్స్ ప్రారంభించాడు. ఇందు కోసం పలు మీడియా సంస్థలకు, యూట్యూబ్ చానెళ్లకు వరుగా ఇంటర్వ్యూలు ఇస్తూ సినిమా ప్రమోషన్ చేస్తున్నాడు. ఓమీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హీరో సిద్ధార్థ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఈ రోజుల్లో సినిమా ప్రమోషన్‌లు, ఇంటర్వ్యూల తరువాత ఏర్పడిన అంచనాల కారణంగా సినిమా వారిని సంతృప్తిపరచలేకపోతే ప్రేక్షకులు నిరాశ చెంది తిడతారు. ఎవరికైనా 3BHK పోస్టర్లు, మ్యూజిక్ నిజంగా ఇష్టపడితేనే సినిమా చూడండి. కానీ నా మాటలను పరిగణలోకి తీసుకుని మాత్రం సినిమాకు రాకండి. ఓవర్‌గా అంచనాల్ని పెంచేసి ప్రేక్షకుల్ని నిరాశపరచాలని నేను భావించడం లేదు. ఓవర్ ఎక్స్‌పెక్టేషన్స్ వల్ల రియాలిటీ ఎంటన్నది తెలుసుకోలేరు అన్నారు. ఇదే ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. సిద్ధార్థ్ మాటలు విన్న నెటిజన్‌లు ఇప్పటికి తనకు తత్వం బోధపడిందని, చాలా మెచ్యూర్‌గా సిద్ధార్థ్ మాట్లాడుతున్నాడని కామెంట్‌లు చేస్తున్నారు. ఉన్నట్టుండీ సిద్ధార్థ్‌లో ఈ మార్పుకు కారణం ఇండియన్ 2 దారుణంగా బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ కావడమేనని తెలుస్తోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో సిద్ధార్థ్ చాలా యారగెంట్‌గా, యాటిట్యూడ్‌తో మాట్లాడి పబ్లిక్‌ని తీవ్రంగా ఇరిటేట్ చేసిన విషయం తెలిసిందే. అతని మాటలకు నెటిజన్‌లు ఓ రేంజ్‌లో ట్రోల్ చేసి తన గాలి తీసేశారు. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకున్న సిద్ధార్థ్ 3BHK మూవీ ప్రమోషన్స్‌లో మాత్రం చాలా మెచ్యూర్డ్‌గా మాట్లాడటం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సిద్ధార్థ్‌లో ఇంత మార్పా? అని అంతా అవాక్కవుతున్నారు.



## ప్రొఫెసర్ ఎస్.హరినాథ్‌కు అభినందనలు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఏయూ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ హరినాథ్ ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ సోషల్ వర్క్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎస్.హరినాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలువురు ప్రొఫెసర్లు, ఉద్యోగులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఆయన గతంలో జాతీయ సేవా పథకం (ఎంఎస్ఎస్) సమన్వయకర్తగా సేవలు అందించారు.

## 18 నుంచి 21 వరకు విశాఖలో పర్యటించనున్న మంత్రి ఫరూక్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్ 18 నుంచి 21 వరకు విశాఖలో పర్యటించనున్నారు. 18న మధ్యాహ్నం రెండు 2.25 నుంచి 3:30 వరకు విశాఖలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన యోగా వేదికలను పరిశీలిస్తారు. 20న యోగా కార్యక్రమం ఏర్పాట్లపై సమీక్ష చేస్తారు. 21న అంతర్జాతీయ యోగా దినోత్స వంలో పాల్గొంటారు.





## డిఎస్‌సికి 66 మంది గైర్హాజరు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ జిల్లాలో డీఎస్సీ పరీక్షకు మంగళవారం 66 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని డీఈవో ప్రేమ్ కుమార్ తెలిపారు. ఉదయం 1186 మందికి 1157, మధ్యాహ్నం 1185 మందికి 1148 అభ్యర్థులు పరీక్షలు రాశారు. జిల్లాలో ఆరు సెంటర్లలో పరీక్షలు జరిగాయి. 97.21% అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

## సమగ్ర శిక్ష సిబ్బందికి గమనిక

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ జిల్లా పరిధిలోని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది బదిలీలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ జె.చంద్రశేఖర రావు తెలిపారు. రిక్వెస్టు లేదా మ్యూచువల్ బదిలీలకు అవకాశం ఉందన్నారు. బదిలీలు కోరుకునేవారు ఈనెల 21వ తేదీలోగా జడ్జి కోర్టు సమీపంలోని కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.






## విశాఖకు మొబైల్ టాయిలెట్లు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ బీచ్ రోడ్డులో ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరగనుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మొబైల్ టాయిలెట్లను విశాఖకు రప్పిస్తున్నారు. గుంటూరు, మచిలీపట్నం పరిసర ప్రాంతాలు నుంచి మొబైల్ టాయిలెట్లతో కూడిన లారీలు విశాఖకు మంగళవారం చేరుకున్నాయి. ఒక్కో లారీలో 16 నుంచి 20 మొబైల్ టాయిలెట్లను తీసుకొస్తున్నట్టు లారీ డ్రైవర్లు తెలిపారు.

## నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫామ్ విక్రయం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సీతంపేటలో బుక్ స్టోర్ సీజ్ విశాఖ సీతంపేటలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాల యాజమాన్యం పుస్తకాలు, యూనిఫామ్ విక్రయిస్తోందని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. పుస్తకాల విక్రయాలను మంగళవారం అడ్డుకుని ఎంఇఓ బాలామణికి ఫిర్యాదు చేశారు. ఆమె పాఠశాల బుక్ స్టోరిని సీజ్ చేశారు. స్కూల్ పేరుతో వీటిని ముద్రించి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. పుస్తకాల పేరుతో వేల రూపాయలు వసూళ్లు చేస్తున్నారన్నారు.



# బీచ్ రోడ్డులో వాహనాలకు నో ఎంట్రీ..!

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖలో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులో కంపార్ట్మెంట్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి కంపార్ట్మెంట్ వద్ద వేదికతో పాటు లైటింగ్, సౌండ్ సిస్టంలను పెడుతున్నారు. కంపార్ట్మెంట్‌కి ఓ యోగా శిక్షకుడు ఉండి అభ్యాసకులతో విన్యాసాలు చేయిస్తారు.
బీచ్ రోడ్డులో కంపార్ట్మెంట్ల ఏర్పాటు ప్రారంభం కావడంతో వాహనాలను అనుమతించడం లేదు.

## 28 వేల మందితో సూర్య నమస్కారాలు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గిరిజనులు సూర్య నమస్కారాలు చేస్తారని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. వివిఎంఆర్‌డిఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వీరంతా అల్లూరి జిల్లా నుంచి విశాఖ వస్తారని చెప్పారు. 108సార్లు సూర్య నమస్కారాలు చేస్తారన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే ఈ కార్యక్రమంలో 28 వేల మంది గిరిజన యువత పాల్గొంటుందన్నారు.



# విశాఖ బీచ్ రోడ్డులో ఆసుపత్రులు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ బీచ్ రోడ్డులో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని భారీ ఏర్పాట్లు చేస్తున్నామని హోం మంత్రి అనిత తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి కిలోమీటరుకు ఓ మెడికల్ క్యాంప్ అందుబాటులోకి తెస్తామన్నారు. బీచ్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో 10 పడకల తాత్కాలిక ఆసుపత్రులు ఏర్పాటు చేస్తామన్నారు. 200 అంబులెన్సులు సేవలు అందిస్తాయని చెప్పారు.

# సూరత్ రికార్డును అధిగమిస్తాం : హోం మంత్రి అనిత

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సూరత్ లో 1.53 లక్షల మంది యోగ విన్యాసాలు చేసిన గిన్నిస్ రికార్డును విశాఖలో అధిగమిస్తామని హోం మంత్రి అనిత తెలిపారు. వివిఎంఆర్‌డిఏ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 21న బీచ్ రోడ్డు పొడవునా 3.50 లక్షల మంది యోగాసనాలు వేస్తారని అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో కూడా యోగ విన్యాసాలు జరుగుతాయని చెప్పారు. నగర వ్యాప్తంగా 5 లక్షల మంది యోగా విన్యాసాలు పాల్గొంటారని భావిస్తున్నట్లు తెలిపారు.



# కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి

### టిడిపి సీనియర్ నాయకులు దేవవరపు రాజుబాబు





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందితాయని దేవవరపు రాజు బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అంకంపేట గ్రామంలో ఎలిమెంటరీ స్కూల్ కాంపౌండ్ హాల్‌కి 13 లక్షలు రూపాయలతో కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజుబాబు మాట్లాడుతూ అభివృద్ధికి పనులకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనితకు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోసాల కృష్ణ, ఎంపిటిసి ఇసరపు సత్య నారాయణ, మాకినీడి చిట్టిబాబు, స్కూల్ చైర్మన్ చందక రాంబాబు, తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొంకిపూడి రమేష్, గణసాల గంగేశ్వరరావు, దేవవరపు బుజ్జి, కొమ్మిరెడ్డి సత్తిబాబు, బుద్దాల వీరబాబు, దేవవరపు సురేంద్ర, అనిశెట్టి వెంకట సూరి, సిద్ధ సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట



**నాతవరం, (రాజధాని వార్తలు):** జగన్ అంటే నమ్మకం.... చంద్రబాబు అంటే మోసం...అనే పుస్తకాన్ని ఆవిష్కరించిన నాతవరం మండలం వైసీపీ నాయకులు...ప్రజలను నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తియిన ప్రజలకు చేసింది ఏమి లేదని..వైసీపీ నాయకులపై దాడులు అక్రమ కేసులు తప్పా కూటమి ప్రభుత్వం చేసిన ఏమిలేదని అన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి మోసం చేసిన చంద్రబాబు ప్రజలు నమ్మి మోసపో యారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండల వైసీపీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, ఎంపీపీ లక్ష్మణమూర్తి వైస్ ఎంపీపీ పైల సునీల్ మండల సీనియర్ నాయుకులు కరక రాజు జిల్లా అధికార ప్రతినిధి మంకు సాంబమూర్తి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అంకంరెడ్డి జమీలుకి నివాళులు

**నాతవరం, (రాజధాని వార్తలు):** మన అభిమాన నాయకులు స్వర్గీయ దివంగత నేత అంకంరెడ్డి జమీలు జయంతి సందర్భంగా పూల మాలలు వేసి నివాళులు అర్పించిన మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర గణేష్, మాజీ ఎమ్మెల్సీ డీవీ సత్యనారాయణరాజు ఈ జయంతి సందర్భంగా ప్రత్యేకంగా డాక్టర్ లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో నాతవరం సచివాలయంలో "జ్వరాలపై మెడికల్ క్యాంప్" ఏర్పాటు చేయటం జరిగింది. నాతవరం మండలం పార్టీ నాయకులు కరక రాజు పార్టీ అధ్యక్షులు జడ్పీటీసీ, ఎంపీపీ,వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయుకులు పాల్గొన్నారు.



# 2 కోట్ల మందికి పైగా రిజిస్ట్రేషన్ : హోం మంత్రి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు 2 కోట్ల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. వివిఎంఆర్‌డిఏ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విశాఖ బీచ్ రోడ్లోని 326 కంపార్ట్మెంట్లలో సుమారు మూడున్నర లక్షల మంది యోగా విన్యాసాలు చేస్తారన్నారు. మిగిలిన వారు వివిధ ప్రాంతాల్లో యోగ విన్యాసాల్లో పాల్గొంటారని తెలిపారు.

# ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుచ్చయ్యపేట ఎంపీడీఓ మృతి

**బుచ్చయ్యపేట, (రాజధాని వార్తలు):** బుచ్చయ్యపేట మండల ఎంపీడీవో వి.విజయలక్ష్మి ఓ ప్రైవేటు ఆసుపత్రి లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఇటీవల గతవారం హై బీపీ వచ్చి బాత్ రూమ్‌లో పడిపోవడంతో మెదడులో నరాలు చిట్లి రక్త స్రావం జరిగి కోమాలోకి వెళ్ళిపోయారు. విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి అకాలంగా మృతి చెందారు. ఆమె అకాల మరణానికి చింతిస్తూ పలువురు మండల అధికారులు, నాయకులు, పంచాయితీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది తమ సంతాపం తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో విశాఖ డైరీ డైరెక్టర్ గేదెలసత్యనారాయణ, తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీపీ దాకవరపు, నాగేశ్వరి దేవి, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణ మూర్తి, ఈఓపిఆర్డి గోకివాడ కోటేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు ఉన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలిపారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan